సాక్షి
నిర్మల్
సోమవారం : 15 : ఏప్రిల్ : 2024



బెట్టింగ్ జోరు..!

నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో జోరుగా క్రికెట్ బెట్టింగులు కొనసాగుతున్నాయి. బెట్టింగ్ రాయుళ్లను గుర్తిస్తున్న పోలీసులు వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. 8లో▸



మంజులాపూర్‌లో సౌకర్యాలేవి?

జిల్లా కేంద్రంలోని 18, 19 వార్డుల్లో కలిసి ఉన్న మంజులాపూర్‌లో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.0 /27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

కార్మికచట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



సీఐటీయూలో చేరుతున్న కార్మికులు

కడెం: కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఐటీయూ పోరాటాలతో భవన నిర్మాణ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలుకు నోచుకున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీకి చెందిన పలువురు భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూలో చేరారు. సమావేశంలో నాయకులు బొమ్మెన సురేశ్, కోటయ్య, శ్రీనివాస్, గంగన్న, అతిక్, వెంకటేశ్, గంగాధర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌టౌన్: హజ్‌యాత్రకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఖాదిముల్ హుజ్జాజ్ హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ హయాద్, కార్యదర్శి అబ్దుల్ రహమాన్ అజీజ్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్ మూన్ లైట్ ఫంక్షన్‌హాల్‌లో హజ్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈసారి హజ్ యాత్రకు నిర్మల్ జిల్లా నుంచి 80మంది వెళ్తున్నారని చెప్పారు. అనంతరం కేంద్ర హజ్ కమిటీ శిక్షకుడు సయ్యద్ మజార్ కాస్మి సహాబ్ ప్రొజెక్టర్‌పై హజ్‌యాత్ర విశేషాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అబ్దుల్ మతిన్, ఇంతియాజ్, ఫెరోజ్‌ఖాన్, ఇజాజ్, ఇమ్రాన్ ఉల్లా అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



పూజల్లో యోగానందసరస్వతి, భక్తులు

ఖానాపూర్: సుర్జాపూర్ గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. గోపాలకృష్ణ మఠ పీఠాధిపతి యోగానంద సరస్వతి హాజరై పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కోటపల్లి అనీశ్, యజ్ఞాచార్యులు నర్సింహమూర్తి, అర్చకుడు ఆచార్య నితీశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం కాషాయమయమైంది. రామనామ స్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా హనుమాన్ దీక్ష ఉపాసకుడు భోగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాలీసా పారాయణం చేశారు. వక్త దిగంబర్‌జీ భక్తుల నుద్దేశించి ప్రసంగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామునాయక్, జెడ్పీటీసీ రాజమణి వెంకాగౌడ్, ఎంపీటీసీ జంగిలి సరిత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం కేంద్ర బలగాలు, పట్టణ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్‌మార్చ్ పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ అనిల్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు భంగం కలగకుండా పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రలోభాలకు లోనుకాకుండా ఓటరు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంత వాతావరణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వ్యక్తుల మీద చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ఎస్సైలు సుమలత, రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మహేశ్వర్‌రెడ్డి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు కొనియాడారు. ఆదివారం బాబాసాహెబ్ జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌గౌడ్ తదితరులున్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన వేడుకలకు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, పార్టీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, విలాస్, వెంకటేశ్, చరణ్‌మార్య, సంతోష్, రమేశ్, మహేశ్, లింగన్న, గంగాధర్ ఉన్నారు. అంబేద్కర్ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహానికి డీసీసీ చైర్మన్ కూచాడి శ్రీహరిరావు పూలమాల వేసి నివాళులర్పించించారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఆమె వెంట డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యోనాస్ అలీ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, పట్టణ, గ్రామీణ సీఐలు అనిల్, శ్రీనివాస్, ఆర్‌ఐలు శైలేందర్, రామ్ నిరంజన్, రామకృష్ణ, డీపీవో సూపరింటెండెంట్ శ్రీనివాస్, పోలీస్ అధికారులు, సిబ్బంది న్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ, సిబ్బంది

వర్తకం మాటున వడ్డీ దందా!

ముధోల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి భైంసాలోని ఓ బంగారు, వెండి వర్తక దుకాణంలో రెండుతులాల బంగారు ఆభరణం చేయించాడు. కొద్దిరోజులకు డబ్బు అవసరముండగా మరో వర్తకుడి వద్ద తనఖా పెట్టి అప్పు తీసుకున్నాడు. కొద్దిరోజులు వడ్డీ క్రమంగా చెల్లించాడు. ఆ తర్వాత వడ్డీ చెల్లించలేని పరిస్థితిలో తాకట్టు పెట్టిన ఆభరణం విక్రయించాలనుకున్నాడు. కానీ, వర్తకుడు 10 గ్రాముల్లో పావలా వంతు తరుగుపోతుందని చెప్పగా అవాక్కయ్యాడు. ఈక్రమంలో అప్పు, వడ్డీ కింద ఆభరణం వదులుకున్నాడు.



భైంసా మండలానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమిని స్థానిక వడ్డీ వ్యాపారి వద్ద తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో వడ్డీ సక్రమంగా చెల్లించలేదు. వ్యాపారి చక్ర వడ్డీ వేయగా అప్పు చెల్లించలేకపోయాడు. తనఖా పెట్టిన కాగితాలు ఇస్తే భూమి విక్రయించి అప్పు తీరుస్తానని చెప్పగా, సదరు వ్యాపారి ససేమిరా అన్నాడు. ఆ తర్వాత మధ్యవర్తులు కల్పించుకోగా వివాదం సద్దుమణిగింది.

- బంగారం, భూములు తనఖా పెట్టుకుని అప్పులిస్తున్న వ్యాపారులు
- సామాన్యులను టార్గెట్ చేసుకుని అధిక వడ్డీ వసూలు చేస్తున్న వైనం
- చెల్లింపులు ఆలస్యమైతే వేధింపులు
- లబోదిబోమంటున్న రుణగ్రహీతలు

భైంసాటౌన్: జిల్లాలో పలువురు వ్యాపారులు అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులిస్తున్నారు. ఇందుకు బంగారు ఆభరణాలు, ప్లాట్లు, భూములు తనఖా పెట్టుకుంటున్నారు. రూ.2నుంచి రూ.5వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. వడ్డీపై వడ్డీ.. చక్రవడ్డీ వేస్తూ అప్పు తీర్చలేని స్థితికి తీసుకువస్తున్నారు. కొన్ని సందర్భాల్లో చేసిన అప్పు తీర్చలేని పరిస్థితుల్లో ఉన్న రుణగ్రహీతలు తనఖా పెట్టిన భూములు, బంగారు ఆభరణాలు తక్కువ ధరకే సొంతం చేసుకుంటూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు.

పేరుకే బంగారు, వెండి వర్తకం

నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో వందల సంఖ్యలో బంగారు, వెండి వర్తక వ్యాపారులున్నారు. రూ.కోట్లలో వ్యాపారం చేస్తూ రూ.లక్షల్లో జీఎస్టీ చెల్లిస్తున్నారు. కొందరు బడా వ్యాపారులు వర్తకం మాటున వడ్డీ దందా చేస్తున్నారు. బంగారు ఆభరణాలు, ప్లాట్లు, భూములు తనఖా పెట్టుకుని అధిక వడ్డీకి అప్పులిస్తున్నారు. పలువురు చెల్లించలేని పరిస్థితుల్లో తనఖా పెట్టిన బంగారం విక్రయిద్దామంటే, ఆభరణాలు చేయించినప్పుడు గ్రాముకు మాసం చొప్పున తరుగు అని చెప్పి తీరా గ్రాముకు రెండు నుంచి రెండున్నర మాసాల వరకు కోత పెడుతున్నారు. భైంసాకు చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి రెడీమేడ్ బంగారు కమ్మలు, పుస్తెలు విక్రయించాడు. వాస్తవానికి 22 క్యారెట్ల బంగారం ఉండాల్సి ఉండగా, ఇలాంటి రెడీమేడ్ కమ్మలు, పుస్తెల్లో అంతకంటే తక్కువ నాణ్యత ఉంటున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా బంగారం నాణ్యత తెలిపే యంత్రాలు లేకపోవడంతో బంగారు ఆభరణాల కొనుగోలుదారులు మోసపోతున్నారు.

ఫిర్యాదులతోనే కదలిక

కామారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఇటీవల పోలీసులు వడ్డీవ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో దాదాపు 70 చోట్ల సోదాలు చేసి భారీగా నగదు, బంగారం, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. పలువురిపై కేసులు నమోదు చేశారు. నిర్మల్ జిల్లాలోనూ అక్రమ వడ్డీ వ్యాపారంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ



సోన్ మండలం సిద్దిలకుంటలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

నిర్మల్ రూరల్: జిల్లాలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్షల షెడ్యూల్‌లో ఇప్పటికే విద్యాశాఖ రెండుసార్లు మార్పు చేసింది. గతంలో కొన్ని తరగతులకు ఉదయం, మరికొన్ని తరగతులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత రాగా అందరికీ ఉదయమే నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. సోమవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే బోర్డు నుంచి జిల్లాకు వచ్చిన ప్రశ్న పత్రాలను మండల విద్యావనరుల కేంద్రాలకు సరఫరా చేశారు. అక్కడి నుంచి ఆయా పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రైమరీ స్థాయి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాయి. షెడ్యూల్ ప్రకారం ఒకటి నుంచి ఐదోతరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ పరీక్షలను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తారు. ఇందుకు జిల్లా పరీక్షల విభాగం ప్రశ్న పత్రాలను సిద్ధం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పంపిణీ చేసింది. అలాగే 6,7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సామాన్య, సాంఘికశాస్త్ర పరీక్షలు, 8, 9 తరగతులకు సైన్స్‌లో భౌతిక, జీవశాస్త్రం పేపర్లు వేర్వేరుగా నిర్వహిస్తారు. ఆరోజు పరీక్షల నిర్వహణకు అదనపు సమయం కేటాయిస్తారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు డీసీఈబీ (జిల్లా కామన్ పరీక్షల బోర్డు) ద్వారా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రశ్న పత్రాలు పంపిణీ చేశారు. ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు సంబంధిత యాజమాన్యం వారు ఒకటి నుంచి ఐదోతరగతి వరకు ఎస్‌ఏ–2 ప్రశ్న పత్రాలు వారే తయారు చేసుకుని పరీక్షలు నిర్వహించుకుంటారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం



జిల్లాలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. ప్రశ్న పత్రాలను సంబంధిత ఎమ్మార్సీల నుంచి స్కూల్ పాయింట్‌కు పంపించాం. విద్యార్థుల సంఖ్య ప్రకారం ప్రశ్న పత్రాలు పొందవచ్చు. లీకేజీ వ్యవహారాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటాం. ఈనెల 23వ తేదీ వరకు మూల్యాంకనం పూర్తి చేసి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

జిల్లాలో 1,02,827 మంది విద్యార్థులు

జిల్లాలో 836 ప్రభుత్వ, 735లోకల్ బాడీ, 198 ప్రైవేట్ పాఠశాలలు, ఏడు మదర్సాలున్నాయి. వీటిలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు 1,02,827 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 55,633 మంది ప్రభుత్వ పాఠశాలలు, 47,003 మంది ప్రైవేట్ పాఠశాలలు, 191 మంది మదర్సాలో చదువుతున్నారు. ఈనెల 8నుంచి పరీక్ష నిర్వహించేందుకు తొలుత నిర్ణయించినా ఉగాది, రంజాన్ కారణంగా 15వ తేదీకి మార్చారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం 9నుంచి 11.30వరకు, ఉన్నత తరగతుల వారికి ఉదయం 9నుంచి 11.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు పరీక్షలున్న రోజు (ఈ నెల 20న) ఎనిమిదో తరగతి వారికి మొదటి పరీక్ష యథావిధిగా కొనసాగనుండగా... రెండో పరీక్ష మధ్యాహ్నం 12.30 నుంచి 3.15 గంటల వరకు నిర్వహిస్తారు. తొమ్మిదో తరగతి వారికి ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9నుంచి 10.30 గంటల వరకు, జీవశాస్త్రం 11నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు పూర్తయిన రోజే మూల్యాంకనం చేసి ఈనెల 23న తుది ఫలితాలు ప్రకటించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదేరోజు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డులపై వారి సంతకాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి వెళ్లారు. వారికి విద్యార్థుల జవాబు పత్రాలను చేర్చడం తలకు మించిన భారంగా సంబంధిత ప్రధానోపాధ్యాయులు భావిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు ఈనెల 24నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులుంటాయి.

సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి 75 ఏళ్లుగా ఎస్టీయూ కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో సంఘ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన 317 జీవోపై నియమించిన మంత్రుల సబ్ కమిటీ నివేదికను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వానికి అందించి సమస్య పరిష్కరించాలని కోరారు. నాలుగు పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం అవసరమైన వివరణ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. మధ్యంతరంగా నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యావలంటీర్లు, పాఠశాల పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను వెంటనే ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వివిధ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఉండాల్సిన నాయకత్వ లక్షణాలు వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. విషయ నిపుణులుగా వచ్చిన రాష్ట్ర నాయకులు ఏవీ సుధాకర్, పున్న గణేశ్, జుట్టు గజేందర్, లక్ష్మీనారాయణ ఫండమెంటల్, లీవ్, సీసీఏ, 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చొక్కారావు ఎస్టీయూలో చేరగా, సదానందంగౌడ్ సభ్యత్వం అందించారు. జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, ప్రధాన కార్యదర్శి జె లక్ష్మణ్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న, నాయకులు నాగభూషణ్, గోవింద్‌నాయక్, సిరాజుద్దీన్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, షేక్‌నబీ, పరమేశ్వర్, శ్రీనివాస్, రతన్‌కుమార్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్‌టౌన్: వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ అగ్నిమాపక అధికారి జయత్‌రామ్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు జెండా ఎగురవేసి వందనం చేశారు. అనంతరం అమరులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లు, గృహాలు, ఆస్పత్రుల సముదాయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, గ్యాస్ ఏజెన్సీలు, పలు స్వచ్ఛంద సంస్థల వద్ద అగ్నిప్రమాద నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగితే 101 నంబర్‌కు సమాచారమివ్వాలని లేదా సమీపంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తూకంలో మోసం చేస్తే చర్యలు



ఎడ్‌బిడ్‌లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ముధోల్: తూకంలో మోసం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయించిన వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు బోరిగాంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎస్వో నందిత, డీఎం శ్రీకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ విఠల్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ముజాయిద్, షాహీద్‌పై కోలిపూరకు చెందిన ఫజిల్, అబ్దుల్ ఆసిల్ గురువారం కత్తులతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోలిపూరకు చెందిన ఫజిల్, అబ్దుల్ ఆసిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన సాయికుమార్ ఇటీవల సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడి పరారీలో ఉండగా ఆదివారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కాలనీలోని ఓ ఇంట్లో మార్చి 25న తెల్లవారుజామున సెల్‌ఫోన్ చోరీ చేశాడు. దొంగతనానికి పాల్పడిన నిందితుడు పరారీలో ఉండగా ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం: మండలంలోని టీజీపల్లి వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులను పంపించగా టీజీపల్లిలో బియ్యం లోడ్ చేస్తున్న వాహనం కనిపించింది. 20 క్వింటాళ్ల బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

కోటపల్లి(చెన్నూర్): గుడుంబా విక్రయించినా తయారు చేసినా కఠినచర్యలు తప్పవని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఆలుగామలో దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లంపాకం, 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడుంబా వల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌పార్టీ, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



అష్టావధానంలో పాల్గొన్న కవులు

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శతావధాని మారేపల్లి వెంకటపట్వర్ధన్ నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన అష్టావధానం అలరించింది. కవులు, రచయితలు పాల్గొని కవితలు సంధించారు. శతావధాని పట్వర్ధన్ తనదైన శైలిలో సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో కవులు, రచయితలు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, మేకల రామస్వామి, దబ్బేట రాజమల్లు, మహవాది సుభాష్, బొడ్డు మహేందర్, వేదాంతం సురేశ్‌బాబు, భాగ్యలక్ష్మి, డాక్టర్ శంకర్‌లాల్ లాహోటి, కొమ్మెర రామ్మూర్తి, పద్మనాభాచా రి, కారెంగుల రామయ్య, పద్యాభిమానులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

బెట్టింగ్ జోరు..!



- మంచిర్యాల జిల్లా కేంద్రంలో జోరుగా క్రికెట్ బెట్టింగ్‌లు
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- బార్ అండ్ రెస్టారెంట్లు, లాడ్జీలే అడ్డా
- అంతా ఆన్‌లైన్‌లోనే..

మంచిర్యాలక్రైం: అన్నిరకాల క్రీడల్లో క్రికెట్ అంటే అందరికీ మక్కువ. చిన్నారుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు క్రికెట్ అంటే అభిమానమే. అదే అభిమానంతో ఐపీఎల్ క్రికెట్‌పై యువత నుంచి మొదలుకుని మధ్య వయస్సు వారు సైతం ఆన్‌లైన్ బెట్టింగ్ పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కొన్ని బార్ అండ్ రెస్టారెంట్‌లు, లాడ్జీలను అడ్డగా చేసుకుని మందు, విందు పార్టీలు ఏర్పాటు చేసుకుని క్రికెట్ చూసుకుంటూ బాల్ టూ బాల్.. వికెట్ టూ వికెట్ అంటూ బెట్టింగ్‌లు పెడుతున్నారు. మరికొందరు రహస్య ప్రాంతాల్లో ఒకేచోట గుమిగూడి సెల్‌ఫోన్లలో క్రికెట్ వీక్షిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఇంట్లోనే ఉండి టీవీల ముందు కూర్చుని ఆన్‌లైన్ ద్వారానే బెట్టింగ్ కడుతున్నారు. పల్లెలు మొదలుకుని పట్టణాల వరకు యువత టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ సంస్కృతి కొన్నేళ్లుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోనూ పట్టణాలు, పల్లెల్లోనూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. బాల్ టూ బాల్.. వికెట్ టూ వికెట్ అంటూ రూ.100 నుంచి బెట్టింగ్ ప్రారంభిస్తారు. రోజూ ఒక్కో మ్యాచ్‌పై సుమారు రూ.1000 నుంచి ప్రారంభమై రూ.లక్షల్లో బెట్టింగ్ సాగుతోంది. అంతేకాకుండా బార్ అండ్ రెస్టారెంట్లలో పెద్దపెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి మ్యాచ్ వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

ఐపీఎల్ అంటేనే బెట్టింగ్ గేమ్

నేడు క్రికెట్ ఆట అంటే అన్ని వర్గాల ప్రజలకు ఎంతో అభిమానం. దీన్ని ఆసరాగా మల్చుకుని కొందరు వ్యాపారం చేస్తున్నారు. కమీషన్లు తీసుకుంటూ బూకీలుగా మారుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగులు నడిపిస్తూ రెండు వర్గాల తరుపున మధ్యవర్తిత్వం చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. గూగుల్‌పే, పేటీఎం ద్వారా సులభంగా మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం ఉన్నందువల్ల ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటనలు వెలుగుచూశాయి. మ్యాచ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి ఆడేది ఎవరైనా సరే తమకు నచ్చిన ఆటగాళ్ల గెలుపు ఓటమిపై తమకున్న ఆలోచన విధానంతో బెట్టింగులు పెడుతున్నారు.

యువత పెడదారి..

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ద్వారా యువత పెడ దారి పడుతోంది. గతంలో ఐపీఎల్ బెట్టింగ్‌లు జరిపిన వారే మళ్లీ రంగలోకి దిగినట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా కేంద్రంలోని ఓ వార్డులో ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లో జోరుగానే సాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బెట్టింగ్ రాయుళ్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

- జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన యువకుడు ఉన్నత చదువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు పాల్పడి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా రూ.3లక్షలు అప్పు చేశాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కొడుకును మందలిస్తే ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయపడి అతను చేసిన అప్పు తిరిగి చెల్లించారు.
- 2023 నవంబర్ 15న ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ మ్యాచ్ నడుస్తుండగా మంచిర్యాలకు చెందిన ఓ సింగరేణి ఉద్యోగి కుమారుడు ఇంట్లో నుంచి రూ.50 వేలు తీసుకెళ్లి బెట్టింగ్‌కు పాల్పడ్డాడు. విషయం ఇంట్లో తెలియడంతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు గమనించి కాపాడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కానీ ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లలేదు.

పలువురిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: ఐపీఎల్ బెట్టింగ్ ఆడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన మణికంఠ, చిలమంతుల శివచారి భైంసాకు చెందిన రెహమాన్ ద్వారా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్, ఐడీ క్రియేట్ చేసుకున్నారు. డబ్బులను కైన్లుగా మార్చి యూజర్ ఐడీలో పెట్టి బెట్టింగ్ ఆడుతున్నామని కస్టమర్లకు చెప్పారు. కస్టమర్లకు కూడా ఐడీ క్రియేట్ చేసి ఆడిపిస్తామని తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,170 నగదు, 4 ఫోన్లు, 1 ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ సీఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత అందరిది



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మనకు అన్ని విధాలుగా హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన అంబేద్కర్ 133వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజ్యాంగమే మనకు రక్ష అన్నారు. కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర పన్నుతున్నాయన్నారు. అలా జరిగితే బడుగు, బలహీనవర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. అలాంటి పార్టీలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఆ మహనీయుడి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసూద్, జహీర్, సోమోరే నాగోరావ్, జితేందర్, ఆచారే దత్త, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచి అంబేద్కర్

ఉట్నూర్‌రూరల్: దేశానికి దిక్సూచి బీఆర్ అంబేద్కర్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి సుగుణతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాలు, బహుజన సంఘాల నాయకులు ఖయ్యూం, చంద్రయ్య, సలీం, లాజర్, ఎక్బాల్, చంద్రభాన్, దూట రాజేశ్వర్, సులోచన, రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు. లక్కారంలో దళిత శక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి పాల్గొన్నారు. పంచశీలచౌక్ వద్ద నిర్వహించిన వేడుకల్లో జయచంద్ర, సాదిక్, కలీం, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): అంబేద్కర్ ఆదర్శప్రాయుడని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి చంద్రశేఖర్, ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఎస్సీ లైజనింగ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్టీ లైజనింగ్ అధికారి రాము, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ప్రవీణ్, ఎస్ కుమార్, రాజు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో...

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఆడిటోరియం నుంచి పెగడపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్టీపీపీ సీటీసీ బసివిరెడ్డి వోఅండ్ ఎం చీఫ్ జెన్‌సింగ్, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు దరావత్ పంతులానాయక్, అధికారులతో కలిసి పెగడపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆడిటోరియంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు భవాని, ఎస్టీపీపీ ఏజీఎంలు సుధాకర్, ప్రసాద్, రమణ, మదన్మోహన్, ఎస్సీ లైసెనింగ్ అధికారి వెంకటయ్య, ఎస్టీ లైసెనింగ్ అధికారి భీమా, సీఎంవోఏఐ అధ్యక్షులు సముద్రాల, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జీఎం

కోల్‌కారిడార్ ఏర్పాటుకు కృషి

శ్రీరాంపూర్: సింగరేణి ప్రాంతాలను కలుపుతూ కోల్‌కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు కోసం ఇప్పటికే తమ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కోల్ సెక్రెటరీ మీరాను కలిశామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు గరిగే స్వామి, కలవేన శ్యాం, నాయకులు తిరుపతి, వెంగళ కుమారస్వామి, ల్యాగల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

చేపల వేటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

జన్నారం: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాజేశ్ (28) ఆదివారం సెలవుదినం కావడంతో తన స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు సమీపంలోని గోదావరి వద్దకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో రాజేశ్ విద్యుత్ వైర్ జాయింట్ చేస్తూ నీటిలో దిగుతుండగా బెడద కృష్ణయ్య విద్యుత్ మోటర్ స్టార్టర్‌లో వైర్లు పెట్టి ఆన్ చేశాడు. ఈ క్రమంలో రాజేశ్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతునికి భార్య తేజస్విని, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



రాజేశ్(ఫైల్)

కిష్టాపూర్‌లో శ్రీరాముని తలంబ్రాలు



కిష్టాపూర్‌లో గోటితో శ్రీరామ తలంబ్రాలు ఒలుస్తున్న మహిళలు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో శ్రీరామ తలంబ్రాలను గోటితో ఒలిచే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆలయం వద్ద సీతారాముల కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాలను గోటితో ఒలిచారు. కార్యక్రమంలో శివాజీ సేన నాయకులు మంతెన ఉదయ్‌కిరణ్, గణేశ్, మనోహర్‌రెడ్డి, రవితేజ, వేముల సాయికిరణ్, చిట్టిరెడ్డి సుజాత, మల్ల సౌజన్య, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో నెలకొన్న నీటి సమస్యపై 'ఇంద్రాదేవి ఆలయం.. సమస్యల మయం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో రావడంతో గ్రామ పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇంద్రాదేవి ఆలయానికి సందర్శించి నీటి సమస్యపై ఆరా తీశారు. ట్యాంకర్ ద్వారా భక్తులకు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుకుమార్, ఎంపీవో జీవన్, భక్తులు పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు చుక్కల దుప్పి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల భీమన్న స్టేడియం సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు చుక్కల దుప్పి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన చుక్కల దుప్పిని వేటకుక్కలు వెంబడించడంతో స్టేడియం వైపు పరుగులు తీసింది. ఈ క్రమంలోఇనుప ఫెన్సింగ్ పై నుంచి దూకే క్రమంలో వైర్ల మధ్యలో పడి మృతి చెందింది. వాకర్లు దుప్పిని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దుప్పి కళేబరాన్ని గోలేటి వన్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రవి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



మృతి చెందిన చుక్కల దుప్పి

రైలులో మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మిదేవి

మంచిర్యాలక్రైం: రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. కడప జిల్లా శాంతకొవ్వూర్ గ్రామానికి చందిన పడమటింటి లక్ష్మిదేవి(36)కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 12న సోమగూడెం కల్వరి చర్చికి కుటుంబ సభ్యులతో వచ్చింది. 13, 14న ప్రార్థనలు ముగించుకుని స్వగ్రామానికి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మందమర్రి సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తేనెకోసం వెళ్లి ఒకరు మృతి

పెంచి: కుటుంబ పోషణకు తేనె సేకరణకోసం వెళ్లి ఒక రు మృతి చెందిన సంఘట న మండలంలో చోటు చే సుకుంది. ఎస్సై శంకర్ తెలి పిన వివరాల ప్రకారం మండలంలోని మందపల్లి గ్రా మానికి చెందిన నెముల్ల రాజేందర్ (35)అదే గ్రా మానికి చెందిన బోజ్జ రాజన్న, బొజ్జ భీమన్న, దేశవే ణి పెద్దులుతో కలిసి శనివారం రాత్రి సబ్‌స్టేషన్ వద్ద ఉన్న రావిచెట్టుపై తేనె తీసేందుకు వెళ్లారు. చెట్టు కొ మ్మ విరిగి కిందపడడంతో తీవ్ర రక్త స్రావం జరిగి అ క్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్ద రు కుమారులు ఉన్నారు. భార్య నముల్ల గంగవ్వ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజేందర్(ఫైల్)

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: ఈ నెల 13న గుర్తు తెలియని రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు (34) మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించగా తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీలేఖ, కూతురు అక్షర, కుమారుడు మణికరణ్ ఉన్నారు. శ్రీ లేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

మద్యానికి బానిసై ఆత్మహత్య

బెల్లంపల్లి: మద్యానికి బానిసైన ఒకరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన బన్న మల్లేశ్ (49)కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తెల్లకల్లు తాగేందుకు ఇంట్లో నుంచి బయలుదేరాడు. మందమర్రి-కల్వరీ చర్చి మధ్యలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి తల్లి బానమ్మ , భార్య ఇందుమతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంచిర్యాల జీఆర్పీ ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



మల్లేశ్ (ఫైల్)

తండ్రి చితికి నిప్పంటించిన కూతురు

కాసిపేట: మండలంలోని సోమగూడెం పాతబస్తీకి చెందిన బన్న మల్లేశ్ ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు సంతానం. రాత్రి అంత్యక్రియలు నిర్వహించగా పెద్ద కూతురు రేష్మా తండ్రి చితికి నిప్పు పెట్టి అందర్నీ కంటతడి పెట్టించింది.



నిప్పు పట్టుకున్న రేష్మా

నగదు పట్టివేత



పట్టుబడిన నగదుతో ఎస్సై రాములు

నేరడిగొండ(బోథ్): బోథ్ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.85 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాములు తెలిపారు. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా డిగ్రస్ గ్రామానికి చెందిన పాండురంగ్ తన ఆటో ఫైనాన్స్ కట్టడానికి రూ.85 వేలు వెంట తీసుకుని నిజామాబాద్ వైపు వెళ్తున్నాడు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు ప్రమోద్‌రెడ్డి, ఏఎస్సై గంగారెడ్డి, కానిస్టేబుళ్లు నాగు, శేషురావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని వంజీరి చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1,80,000 నగదు పట్టుబడినట్లు ఎస్సై సోనియా తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

తాండూర్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం రెబ్బెన మండలం నుంచి మంచిర్యాలకు ఇసుక లోడుతో వెళ్తున్న లారీని బోయపల్లి గ్రామ శివారులో పట్టుకున్నారు. అనుమతి పత్రాలు, బిల్లులు లేకపోవడంతో లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని దివ్య లాడ్జిలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం లాడ్జిపై దాడి చేసి బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన నేర్ల రవికుమార్, దువ్వె నితీష్, కల్లపెల్లి శశి, దేవరకొండ సతీష్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, మట్కా చార్ట్స్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి)లో ఆదివారం ఎస్సై మహేష్ కుమార్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి రూ.30వేల విలువచేసే 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రహీంపాషా ఆదేశాల మేరకు గంజాయిపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.